నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

కరీంనగర్
పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల

గురువారం 21 మార్చి 2024    8 పేజీలు




# అధికార పార్టీ అభ్యర్థులు ఎవరు..??



- కరీంనగర్,పెద్దపల్లి లోక్‌సభ అభ్యర్థులను ప్రకటించని కాంగ్రెస్
- ఆశావాహులు ఉన్నా... గెలుపు గుర్రాల కోసం అన్వేషణ..
- వర్గపోరుతో అభ్యర్థుల ఎంపిక ఆలస్యం..??
- మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు..

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**
**బోనాల వెంకటేశ్**

లోక్ సభ ఎన్నికల షెడ్యుల్ విడుదలైన కూడా ఇప్పటి వరకు అధికార కాంగ్రెస్ పార్టీ కరీంనగర్,పెద్దపల్లి ఎంపీ అభ్యర్థులను ప్రకటించలేదు. ఇటీవల ప్రభుత్వంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నూతనోత్సాహంతో లోక్ సభ ఎన్నికల్లో పోటీల్లో దిగుతుందనుకుంటే..అభ్యర్థుల ఎంపిక ప్రతిపక్ష పార్టీలకంటే ఆలస్యం చేయడం వలన కాంగ్రెస్ కార్యకర్తలు నిరుత్సాహానికి గురవుతున్నారు. రాష్టంలో ఎన్నికల వేడి ప్రారంభం అయిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో ఏలాంటి కదలికలు లేవు.కాంగ్రెస్ పార్టీలో ఈ రెండు స్థానాలకు ఆశవాహులు ఎక్కువగా ఉన్నారని ఒక అభిప్రాయం ఉన్నప్పటికీ .. గెలిచే వారికే టికెట్లను ఇవ్వాలని అధిష్టానం ఆలోచిస్తుందని తెలియవస్తుంది. ముఖ్యంగా పెద్దపల్లి స్థానం నుండి టికెట్ కోసం గట్టి పోటీ ఎదురవుతుంది. ఏలాగైనా టికెట్టు తమ వర్గం వారికే దక్కించుకోవాలని చూస్తున్నారని...దీని వలన కూడా అభ్యర్థుల ఎంపిక ఆలస్యం అవుతుందని కాంగ్రెస్ పార్టీలో చర్చ జరుగుతుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ,పొన్నం ప్రభాకర్ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తు.. ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. మరోవైపు ప్రతిపక్ష పార్టీలైన బిజెపి,బిఆర్ఎస్ పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించి ప్రజాక్షేత్రంలో ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఇప్పటికైనా త్వరగా అభ్యర్థులను ప్రకటించాలని కాంగ్రెస్ కార్యకర్తలు కోరుకుంటున్నాను.

### ఎకరాలకు రూ.25 వేల
## నష్ట పరిహారం అందించాల్సిందే

- పంటల బీమాను అమలు చేయాల్సిందే
- రూ.2 లక్షల రుణమాఫీ ఎందుకు అమలు చేయరు?
- ఎకరాకు రూ.15 వేల సాయం అందించాల్సిందే
- కౌలు రైతులకు ఎకరాకు రూ.12 వేలు ఇవ్వాల్సిందే
- బిజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ డిమాండ్
- ముస్తాబాద్‌లో పంట నష్టపోయిన పొలాలను పరిశీలించిన ఎంపి



**సూర్య ముస్తాబాద్**

అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతాంగాన్ని పూర్తిగా ఆదుకోవాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. అందులో భాగంగా ఎకరాకు రూ.25 వేల చొప్పున ఎకరాలకు రూ.25 వేల నష్టపరిహారం అందించాల్సిందే తక్షణ సాయం అందించాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పంటల బీమా పథకం, రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని, రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 లక్షల సాయం అందించాలని కోరారు.బుధవారము సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం సిరిసిల్ల నియోజకవర్గం పోతుగల్ గ్రామంలో పంట నష్టపోయిన పొలాలను పరిశీలించిన బండి సంజయ్ బాధిత రైతులతో మాట్లాడారు. పంట నష్టం వివరాలను తెలుసుకున్నారు... వారి బాధలను విన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వానలతో రైతులు నష్టపోతూనే ఉన్నరు. గతంలో కురిసిన వర్షాలతో నా నియోజకవర్గంలో చాలా చోట్ల రైతులు పంట నష్టపోయారు. ఈసారి సిరిసిల్ల నియోజకవర్గం లోని తంగళ్లపల్లి, పొతుగల్, గంభీరావుపేట ప్రాంతాల (మిగతా 2లో)



### ఘనంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి
## బ్రహ్మోత్సవాలు

**సూర్య ధర్మపురి:**

ప్రముఖ పుణ్యక్షేత్రం ధర్మపురి క్షేత్రంలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా మొదటిరోజు బుధవారం పుట్ట బంగారు కార్యక్రమాన్ని దేవస్థానం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో ఉదయం 11 గంటలకు అంకురార్పణ, కలశ స్థాపన, వరాహతీర్థం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం చింతామణి చెరువు కట్ట పైన గల ప్రత్యేకంగా అలంకరణ చేసిన వేదికపై దేవాలయం నుండి (మిగతా 2లో)





## ఎకరాలకు రూ.25 వేల

# నష్ట పరిహారం అందించాల్సిందే

**(మొదటి పేజి తరువాయి)**

రైతులు చాలా నష్టపోయారు. నాకు తెలిసి ప్రస్తుతం ఏ రైతు కూడా లాభం కోసం వ్యవసాయం చేసే పరిస్థితి లేదు. చేసిన అప్పులు తీర్చడం కోసమే వ్యవసాయం చేసే దుస్థితి ఏర్పడింది. రైతు ఏడ్చిన రాజ్యం ఎద్దు ఏడ్చిన వ్యవసాయం బాగుపడ్డట్లు చరిత్రలో లేదు.. ఈ విషయం అన్ని పార్టీలకు తెలుసు. అధికారంలోకి రాకముందు ఒక మాట.. వచ్చిన తరువాత మరో మాట రాజకీయ పార్టీలకు అలవాటైపోయిందని అన్నారు.గతంలో సీఎంగా ఉన్నప్పుడు కేసీఆర్ చొప్పదండి నియోజకవర్గంలో పర్యటించి ఎకరాకు రూ.10 వేల సాయం వెంటనే విడుదల చేస్తున్నట్లు ప్రకటించిండు.. కానీ పైసా సాయం చేయలే. కేంద్రం ఫసల్ బీమా పథకం ప్రవేశపెడితే... అమలు చేయకుండా... అంతకంటే గొప్ప పథకం అమలు చేస్తానని పదేళ్లుగా మాటలు చెప్పిండే తప్ప ఇంతవరకు అమలు చేయలేదు. ఏ ఒక్క రైతుకు కూడా నయాపైసా సాయం చేసిన దాఖలాల్లేవు. కోపంతో రైతులు పంటలను తగలబెట్టుకున్నరు. ఇదే జిల్లాలో వడ్ల కుప్పలపై చనిపోయారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఎందుకు ఆదుకోవడం లేదు? మీరు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదు? పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేలు తక్షణ సాయం అందించాలి. రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేల చొప్పున సాయమందించాలి. కౌలు రైతులకు సైతం సాయం అందించాల్సిందే. రూ.2 లక్షల రుణమాఫీ చేయాలి. పంటల బీమా పథకాన్ని వెంటనే అమలు చేయాలి. ఎన్నికల పేరుతో ఆపే ప్రయత్నం చేయెుద్దు. ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకుని సాయం అందించాల్సిందే. నాకు తెలిసి ఎన్నికల కమిషన్ అభ్యంతరం చెప్పదు. ఈ విషయంలో తమ పార్టీ రైతుల కోసం పూర్తిగా సహకరిస్తామని అన్నారు.

## రాములోరి హుండీ ఆదాయం రూ 4,04,434

**సూర్య, ఇల్లందకుంట**



అపర భద్రాద్రి గా పేరుగాంచిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం హుండీలను బుధవారం దేవాదాయ శాఖ పరిశీలకులు పి సత్యనారాయణ ఆధ్వర్యంలో శ్రీ రామ సేవ సమితి వారిచే లెక్కించగా 13 హుండీల ద్వారా మొత్తం ఆదాయం రూ 4,04,434 వచ్చినట్లు ఆలయ ఈవో కందుల సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



## పలు శుభకార్యాలలో పాల్గొన్న ప్రణవ్ బాబు

**సూర్య, హుజురాబాద్**

హుజురాబాద్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో బుధవారం పలు శు భకార్యాల్లో హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వొడితల ప్రణవ్ బాబు హాజరై ఆశీర్వదించారు. హుజురాబాద్ పట్టణంలో కాంగ్రెస్ నాయకులు ఇప్పలపల్లి చందు సోదరుడు ఇప్పలపల్లి నరేష్ - డాక్టర్ గీత ల కుమారుడు శ్రీరామ్ వైదిక్ పుట్టినరోజు వేడుకల్లో, జూపాక గ్రామంలో సదానందం కూతురు నిశ్చితార్థ వేడుకల్లో ఆయన పాల్గొని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తిప్పారపు సంపత్, కౌరు సుగుణాకర్ రెడ్డి, ఎండీ. ఖాలిక్ హుస్సేన్, సాయిల రాజు, ఉప్పు శ్రీనివాస్ పటేల్, అలీమ్, రాజేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విశ్వకర్మల కార్పొరేషన్ ను ఏర్పాటు చేయాలి

**సూర్య, హుజురాబాద్**



రాష్ట్ర ప్రభుత్వం విశ్వకర్మల అభివృద్ధి కోసం నూతనంగా విశ్వకర్మల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని టిపిఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు సింగారం ప్రేమ్ కుమార్ అన్నారు. బుధవారం ఆయన హుజురాబాద్ లో మాట్లాడుతూ విశ్వకర్మల కులస్తులు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారని, వారి అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కార్పొరేషన్ ను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టిపిఆర్ఎస్ నాయకులు బి. సమ్మయ్య, చల్లూరి రఘు చారి, గొర్రె తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## సెక్రటరీ పై ఫిర్యాదు చేసిన పట్టించుకోని అధికారులు

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం పన్నూరు గ్రామ పంచాయతీ కి బదిలీ చేసిన సెక్రటరీ సరిత పై ఫిర్యాదు చేసిన అధికారులు స్పందించడం లేదని ఎంపీటీసీ కొప్పుల గణపతి ఆరోపించారు. సుందిళ్ల గ్రామం నుండి ఆమెను పన్నూరుకు డిప్యూటేషన్ పై బదిలీ చేశారని అన్నారు. ఇదే గ్రామంలో చదివిన ఆమెను ఇక్కడే పోస్టింగ్ ఎలా ఇస్తారని ఆయన ప్రశ్నించారు. అధికారులు కొందరు లాలూచీపడి ఈ డిప్యూటేషన్ చేశారని, దీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పంచాయతీరాజ్ కమిషనర్ కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

## ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన వ్యవసాయ అధికారి..

**సూర్య ఇబ్రహీంపట్నం**



మండలంలోని యామాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డీలర్ల ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి దీపిక బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టాక్ రిజిస్టర్లు, దుకాణాలలో స్టాక్ ధరల పట్టికలు, బిల్ బుక్కులు పరిశీలించారు. నిబంధనల మేరకు విక్రయాలు జరపాలని ప్రతి కొనుగోలుదారుడు విధిగా బిల్లు అందించాల న్నారు. స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు బోర్డు పైన నమోదు చేయాలని సూచించారు

## అంజన్న ను దర్శించుకున్న నిజామాబాద్ అడిషనల్ జడ్జి కనకదుర్గ

**సూర్య మల్యాల**



ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి వారిని బుధవారం నిజామా బాద్ అడిషనల్ జడ్జి కనకదుర్గ కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శిం చుకున్నారు అడిషనల్ జడ్జి కనకదుర్గ కుఆలయ అధికారులు అర్చకులు స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు

## ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య

**సూర్య మల్యాల**

మల్యాల మండలంలోని నూక పల్లి గామానికి చెందిన సైదుల వంశీ 25 అనే యువకుడు బుధవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు గత రెండు సంవత్సరాల క్రితం ఓగులాపూర్ గ్రామానికి చెందిన యువతి తో వివాహం జరిగింది కాగా సంవత్సరం క్రితం విడాకులు తీసుకున్నారు అప్పటినుండి వంశీ మానస్థాపం చెంది ఒంటరితనంతో బాధపడుతూ ఈ క్రమంలో ఇంట్లో ఫ్యాన్ కు ఉరేసుకొని మృతి చెందాడని పోలీసులు తెలిపారు మృతుడి తండ్రి సైదులు రాజయ్యఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు పడుతున్నామని ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు

## సహృదయతను చాటుకున్న ప్రణవ్ బాబు

**సూర్య, హుజురాబాద్**



రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని వెంటనే మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరి ఆటోలో ఆసుపత్రికి తరలించి తన సహృదయతను కాంగ్రెస్ నేత వి. ప్రణవ్ బాబు చాటుకున్నారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడానికి బుధవారం తన స్వగృహం నుండి హుజురాబాద్ కు వస్తున్న హుజురాబాద్ ఇంచార్జీ వొడితల ప్రణవ్ బాబు తుమ్మనపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడి రోడ్డుపై పడి ఉన్న తుమ్మనపల్లికి చెందిన దక్షిణామూర్తిని చూసి వెంటనే తన వాహనం ఆపి గాయపడిన వ్యక్తికి మొదట ధైర్యం చెప్పి, వైద్యులతో మాట్లాడి ఆటోలో హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తరువాత దక్షిణామూర్తి ఆరోగ్యం పై వాకబు చేయడానికి చూసిన వారు ప్రణవ్ బాబు మంచితనాన్ని ఔరా..! అనుకున్నారు.

## ఘనంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

**(మొదటి పేజి తరువాయి)**

బయలుదేరి వచ్చిన స్వామి వారలను ఆశీనులను చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి బ్రహ్మోత్స వాలకు తరలివచ్చిన భక్తులు పుట్ట బంగారు సమయంలో పూజలను తిలకించి అర్చకుల ఆశీస్సులను పొందారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దేవస్థానం ఈవో సంకటాల శ్రీనివాస్, వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, రెనవేషన్ కమిటీ సభ్యులు జక్కు రవీందర్, ముత్తినేని మల్లేష్, బాదినేని సత్యనారాయణ, రామ్దేని మొగిలి, దాసరి పురుషోత్తం ఎదులాపురం మహేందర్, రాపర్తి సాయికిరణ్, స్తంభంకాడి గణేష్, పసుపు నూటీ శ్రీకాంత్, మాదాసు మల్లేష్, లశెట్టి సుజాత నందయ్య స్వామి, కొమురెల్లి పవన్ కుమార్, నేదునూరి శ్రీధర్, భక్తులు పాల్గొన్నారు.



## మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేత

**సూర్య-గోదావరిఖని:**

రామగుండం కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కు చెందిన సభ్యులు కె.సదానందం, పి.శ్రీనివాస్ ఇటీవల అకాల మరణం చెందగా బుధవారం వారి కుటుంబాలకు అసోసియేషన్ సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మృతుల కుటుంబాలను పరామర్శించి వారికి ఆర్థిక సాయం క్రింద రెండు కుటుంబాలకు కలిపి రూ.30 వేల నగదును ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు కజాంపురం రాజేందర్, ప్రధాన కార్యదర్శి పోలు సతీష్, కోశాధికారి పిట్టల శ్రీనివాస్ సీనియర్ సభ్యులు కరుణాకర్ రెడ్డి, మొగిలి, సురేందర్ పాల్గున్నారు.

## గుండెపోటుతో ఏఎస్సై మార్కొండ కిషన్ మృతి

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్లో ఏఎస్సై గా విధులు నిర్వహిస్తున్న మార్కొండ కిషన్ (59) బుధవారంనాడు కరీంనగర్ జ్యోతినగర్ లోని తన నివాసంలో గుండెపోటుతో మృతిచెందారు. 1984 బ్యాచ్ కి చెందిన ఏఎస్సై కిషన్ గారు 40 సంవత్సరాలు సుదీర్ఘ కాలంపాటు పోలీస్ శాఖలో సేవలందించారు. అతని ఉత్తమ సేవ లను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే అతి ఉత్క్రిష్ట సేవా పథకాన్ని ప్రకటించిగా, కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి ఐపీఎస్ చేతుల మీదుగా అందుకున్నారు. మృతుడికి భార్య , ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు వున్నారు. అంత్యక్రియలు వారి స్వగ్రామమైన తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లిలో జరగనున్నాయి.

## దుర్గామాత విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో రాజ్ ఠాగూర్ దంపతులు

**సూర్య-గోదావరిఖని:**

సింగరేణి రామగుండం ఏరియా-1 పరిధిలోని సెక్టార్-2, న్యూ ఫిల్టర్ బెడ్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న దుర్గా మాత అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన, పూజా కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సతీసమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు రాజ్ ఠాకూర్ దంపతులకు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. తదుపరి దుర్గామాత విగ్రహ ప్రతిష్టాపన పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఆ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ అమ్మవారి కరుణాకటాక్షాలతో కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న కార్మికులు ఎలాంటి ప్రమాదాలు, ఇబ్బందులకు గురికాకుండా అమ్మవారు కాపాడుతుందనే నమ్మకం తనకు ఉందని అన్నారు.



## ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా...

# కాలం మారినా ఉనికి కోల్పోని కవిత్వం



\- కొత్త అనిల్ కుమార్

**గాయపడిన హృదయం**
**నుండి గేయమై వచ్చి**
**వేలాది గుండెల గాయాన్ని మాన్పిస్తుంది**
**తన విస్తృతిని విశ్వవ్యాప్తం చేసుకుంటూ**
**మానవ శోకాలను అరికట్టే**
**ఔషదంగా మారిన ఆధునిక శ్లోకం**
**కవిత్వమంటే.**

శోకం నుండి శ్లోకం పుట్టి మహా కావ్యాలుగా మారి సమాజాన్ని జాగృత పరిచాయి.ఎన్నో ఇతిహాసాలను భావి తరాలకు అందించే వారధిగా సాక్ష్యాలుగా నిలబడ్డాయి. అంతటి శక్తి కలిగిన సాధనం కవిత్వం. వివిధ ప్రక్రియల్లో కవిత్వం వర్ధిల్లి నిత్య నూతన సృజనతో అన్ని వర్గాల ప్రజలను తన వైపు మళ్లించుకుంటుంది.

హృదయం నుండి వచ్చిన మాటలే అక్షరాలుగా కాగితంపై ఆకర్షణీయంగా పేర్చడం. ఎత్తుకున్న సంకల్పాన్ని పదాలుగా పరిచి భావ ప్రకటన చేయడం.వ్యాసాలు,ఉపన్యాసాలు, కథల ద్వారా చెప్పే విషయాలను పంక్తుల రూపంలో నర్మగర్భంగా చెప్పి మనసుకు ఉల్లాసంతో పాటు కొత్త ఆలోచనలను రేకెత్తించే అద్భుతమైన సాధనం కవిత్వం. మంచి భాష, కొత్త విషయాలు, ప్రయోజనకరమైన వస్తువులను ఎన్నుకుని రాసే కవితకు ఇలా అలా ఉండాలనే నిబంధనలు ఏమి లేని ప్రక్రియ కవిత్వం.చదవాలన్న ఆసక్తి , రాయాలన్న ఆశ ఉంటే ఎవరైనా సరే వారి అభిప్రాయాన్ని ఉద్దేశ్యాన్ని కవితగా ప్రకటించవచ్చు.

కవిత్వంలో పద్య కవిత,దీర్ఘ కవిత వచన కవిత,మినీ కవిత అనే రకరకాల ప్రక్రియలతో కవితలు రాయవచ్చు మనం చెప్పాలనుకున్న విషయాన్ని తగిన అక్షరాలను పదాలను పొందుపరిచి వాటిని లయబద్ధంగా అక్షరీకరిస్తే కవిత ఆకర్షణగా ఉంటుంది. కాలానుగుణంగా రాసే వారిని బట్టి కవిత్వ లక్షణాలు ప్రాచుర్యంలోకి వస్తున్నాయి తొలత పద్యాలలోనే కవిత్వం రాసిన వాళ్ళు తర్వాత కాలంలో రచన కవిత్వం రాయడంతో అది అందరినీ ఆకర్షించడమే కాకుండా కొత్తగా రాసే వాళ్లకు కూడా సులభతరంగా ఉండడంతో చాలా ఉంది వచన కవిత్వాన్ని ఆదరిస్తూ వస్తున్నారు.దాని తర్వాత ఏ విషయం అయినా ముక్కుసూటిగా చెప్పాలంటే మినీ కవితలతో చెప్పడం వల్ల చదివేవారికి హుషారైన అనుభూతి కలిగేది. అదేవిధంగా ఒకే విషయంపై సుదీర్ఘంగా ఎక్కువ పంక్తులు రాసే కవితను దీర్ఘ కవితగా పేర్కొంటారు ఇందులో రాసే విషయం అంత ఒకే అంశానికి సంబంధించినది ఉంటుంది. వీటితో పాటే నానీలు,హైకులు ,రెక్కలు అని కొత్తకొత్త ప్రయోగాలు జరిగాయి.

ప్రస్తుతం మనుషులు సామాజిక మాధ్యమాలకు ఎక్కువ సమయం కేటాయిస్తున్న ఈ కాలంలో కూడా కవిత్వాన్ని వారి వారి అభిరుచికి తగ్గట్టుగా నిర్మించుకుంటూ, ఆదరిస్తు, ఆస్వాదిస్తూ సాహిత్యాభిమానులు వారి కవిత దాహాన్ని తీర్చుకుంటున్నారు. ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా మిత్రులకు సాహిత్యాభిమానులకు కవిత దినోత్సవ శు భాకాంక్షలు.



## వైభవంగా చెన్నకేశవ స్వామి కళ్యాణం

**సూర్య - మానకొండూర్ :**

మానకొండూర్ మండలం వెల్ది గ్రామంలోని భక్తుల కొంగు బంగారం కోరిన కోర్కెలు తీర్చే శ్రీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణ మహోత్సవం అంగరంగా వైభవంగా నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో తలంబ్రాల బియ్యం కలిపి మంగళవాయిద్యాల మధ్య ఊరేగింపుగా లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయానికి వచ్చారు. కల్యాణోత్సవానికి ఆలయ చైర్మన్ చల్లూరి విశ్వనాథ చారి దంపతులు పాల్గొని స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు.అనంతరం అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య వారి చేతుల మీదుగా కల్యాణం జరిపించారు. ఈ వేడుకలను వేడుక తిలకించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలొచ్చిరు. పాడి పంట పిల్లా పాపలు చల్లంగా చూడు స్వామి అంటూ భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. గురువారం స్వామివారి రథోత్సవం, బలిహారం పూర్ణాహుతి అన్నదాన కార్యక్రమాలు జరుపబడునని ఆలయ చైర్మన్ విశ్వనాథ చారి తెలిపారు. ఈ వేడుకల్లో ఆలయ చైర్మన్ చల్లూరి విశ్వనాథ చారి, ఉపాధ్యక్షులు తాళ్లపల్లి శ్రీనివాస్ ,ప్రధాన కార్యదర్శి కోల రమేష్, కోశాధికారి గంప చంద్రమౌళి, పెంచాల కిషన్ రావు, నూతి శ్రీనివాస్, రుద్రవరం సాయికుమార్, పాలకవర్గం సభ్యులు నగునూరి ప్రదీప్, ఎలగందుల రామకృష్ణ, గడమల్ల నరసింగం, పెనమల్ల కొమరయ్య, తగరపు రమేష్, విరగొని లక్ష్మీ, బాలసాని భాగ్యలక్ష్మి, ప్రభాకర్ రావు, పప్పు మొండయ్య,పప్పు సత్యనారాయణ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాట్రపల్లిలో పోలీస్ కవాతు

**సూర్య, హుజురాబాద్ రూరల్**

హుజురాబాద్ మండలం కాట్రపల్లి గ్రామంలో బుధవారం పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పోలీసులు జవానులతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా హుజురాబాద్ ఏసిపి శ్రీనివాస్ జీ మాట్లాడుతూ ఎలక్షన్ కోడ్ నందు వాట్సప్ గ్రూపులలో అభ్యంతరమైన మెసేజ్ లు షేర్ చేయకూడదని అన్నారు. ఎలాంటి మీటింగ్ కైనా ముందస్తు పర్మిషన్ తీసుకోవాలని, శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ టౌన్ సిఐ బొల్లం రమేష్, 40 సిఐఎస్ఎఫ్ ఆఫీసర్స్, జవాన్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

\- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు

**సూర్య, కరీంనగర్ ప్రతినిధి**



కరీంనగర్ జిల్లాలోవడగళ్ల వానల వల్ల పంట నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఎకరాకు 25 వేల రూపాయల చొప్పున ఇచ్చి వెంటనే ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం( ఏఐకేఎస్ ) జిల్లా సహాయ కార్యదర్శిపైడిపల్లి రాజు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.ఈ సందర్భంగా పైడిపల్లి రాజు మాట్లాడుతూ వేలాది ఎకరాల పంటలు నష్టపో యాయని వడగళ్ల వాన రైతన్నను తీవ్ర ఆందోళన గురి చేసిందని ఆయన అన్నారు వరి. మామిడి, బత్తాయి తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయని పంట చేతికి వచ్చిన రైతన్నకు వడగండ్ల వాన కడగండ్లు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.



## బిజిగిరి షరీఫ్ దర్గాలో ఈటల జన్మదిన వేడుకలు

**సూర్య, జమ్మికుంట రూరల్**

జమ్మికుంట మండలంలోని బిజిగిరి షరీఫ్ గ్రామంలోని హజ్రత్ సయ్యద్ ఇంకుషావలి దర్గాలో మాజీ మంత్రి ఈటల రాజేందర్ జన్మదినం సందర్భంగా జమ్మికుంట ముస్లిం మైనార్టీ నాయకులు బుధవారం దర్గాలోని సమాధులకు చాదర్లు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మైనార్టీ నాయకుడు మహమ్మద్ నసిరుద్దీన్ మాట్లాడుతూ ఈటల రాజేందర్ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని, రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో మల్కాజ్ గిరి నియోజకవర్గం నుండి భారీ మెజార్టీతో గెలవాలని దర్గాలో ప్రార్థించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మొహమ్మద్ నసిరుద్దీన్, మహమ్మద్ అహ్మద్, మహమ్మద్ యాకూబ్, మొహమ్మద్ హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఆర్ ఆర్ కాంట్రాక్ట్ ఏజెన్సీ పనుల నాణ్యత పై సమగ్ర పరిశీలన, విచారణ చేపట్టండి

**-జిల్లా కలెక్టర్ తో బిజెపి కార్పొరేటర్ రాపర్తి విజయ**

**సూర్య, కరీంనగర్ ప్రతినిధి**



స్మార్ట్ సిటీ పనుల్లో నాణ్యత ప్రమాణాలు , నిబంధనలు పాటించకుండా, శ్రీ రాజరాజేశ్వర కాంట్రాక్ట్ ఏజెన్సీ పై చర్యలు తీసుకోవాలని బిజెపి కార్పొరేటర్ రాపర్తి విజయ బుధవారం జిల్లా కలెక్టర్ , అడిషనల్ కలెక్టర్ ను కలిసి ఫిర్యాదు చేశారు.సదరు కాంట్రాక్టు ఏజెన్సీ స్మార్ట్ సిటీ పనుల కింద రహదారులు, మురికి కాలువలు , ఫుట్ పాత్ టైల్స్ ల నిర్మాణ పనులను చేపట్టిందని, . నిర్మాణ పనులన్నీ నియమ నిబంధనలు పాటించకుండా, నాసిరకంగా , నాణ్యత లోపంతో జరిగాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఎస్ఆర్ఆర్ కాంట్రాక్ట్ ఏజెన్సీ చేపట్టిన మురికి కాలువ వల్ల ప్రధాన రహదారుల పైకి డ్రైనేజీ నీళ్లు ప్రవహించే పరిస్థితి వచ్చిందని,. అనేక రహదారులు పగుళ ,,పెచ్చులూడిపోయే పరిస్థితి తోపాటు వేసిన పార్కింగ్ టైల్స్ కుంగిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. స్మార్ట్ సిటీ పనులు దక్కించుకున్న ఎస్ఆర్ఆర్ ఏజెన్సీ నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి , ఇష్టారాజ్యంగా పనులు చేపట్టిందని, . స్మార్ట్ సిటీ పనుల్లో చేయని పనులకు కూడా ఎంబి రికార్డ్ చేయించినట్టు ఆరోపణలు ఉన్నాయని, ప్రస్తుతం స్మార్ట్ సిటీ పనులపై సదరు కాంట్రాక్టు ఏజెన్సీకి మున్సిపల్ కార్పొరేషన్ నుండి బిల్లులు చెల్లించడానికి చెక్కులు సిద్ధం చేస్తున్నందున , దానిని నిలుపుదల చేసి, సదరు ఎస్ఆర్ఆర్ కంపెనీ స్మార్ట్ సిటీ కింద చేపట్టిన అన్ని పనులపై నాణ్యత పరిశీలన , విచారణ చేపట్టి,ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాలని కార్పొరేటర్ రాపర్తి విజయ జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు.

### అల్ఫోర్స్ ఇ-టెక్నో విద్యార్థులకు

# క్వెస్ట్ సైన్స్, మ్యాథ్స్ ఒలంపియాడ్లో జాతీయ స్థాయి బహుమతులు

**సూర్య, కరీంనగర్ ప్రతినిధి**




విద్యార్థులకు మ్యాథ్స్ , సైన్స్ చాలా కీలకమని మరియు వారికి పలు పోటీ పరీక్షల్లో జయకేతనం సాధించడానికై తోడ్పాటు అందిస్తుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి అన్నారు స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ సైన్స్, మ్యాథ్స్ ఒలంపియాడ్ లో అత్యుత్తమ బహుమతులు సాధించిన సందర్భంగా ఏర్పాటుచేసినటువంటి ప్రత్యేక అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరైనారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మ్యాథ్స్, సైన్స్ అనేక విషయాలు ఉన్నాయని, ఆ విషయాలను సులభంగా నేర్చుగోగ్గలుతామని అభిప్రాయపడుతూ ప్రతి ఒక్కరు గణితం, సైన్స్ శాస్త్రాలలో తెలుపబడిన నియమ నిబందనలను సరిగ్గా పాటించి ముందంజలో ఉండడమే కాకుండా ఘనవిజయాలను చాలా సులభంగా సాధించాలని వారు ఆకాక్షించారు. పాఠశాల స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులను వివిధ స్థాయిలలో, సంస్థల వారు నిర్వహిస్తున్న పలు పోటీ పరీక్షలకు ఎంపిక చేయడం జరుగుతుందని అభిప్రాయపడుతూ ప్రతిఒక్కరు అన్ని విధాలుగా అంశాలను సాధన చేసి పట్టు సాధించి ఆదర్శంగా ఉండాలని సూచించారు. ఈ క్రమంలో ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ అయిన క్వెస్ట్ ఒలంపియాడ్ వారు నిర్వహించిన జాతీయ స్థాయి గణిత ఒలం పియాడ్ పాఠశాలకు చెందిన ఆర్. శ్రీతన్, 3వ తరగతి, కె. హవీష్ రెడ్డి, 4వ తరగతి, రెడ్డి శ్రీరాజ్ రెడ్డి, 5 వ తరగతి, శివేన్ రెడ్డి, సిద్విక్, ఎన్. సహర్ష్, 6 వ తరగతి, శ్లోకా పున్నమ్, వి. శ్రీ చరణ్ రెడ్డి, పి.వంశీ కృష్ణా, 7 వ తరగతి, స్వరవిస్మృత్, సుమేధా మడమరాజు, 8 వ తరగతి, పి.శివాణి, జె.హాన్సిక రావు , తదితరులు గెలుపొందారని హర్షం వ్యక్తం వేశారు.క్వెస్ట్ సైన్స్ ఒలంపియాడ్లో గెలుపొందిన విద్యార్థుల వివరాలు: జి. జోయల్ డెవిన్, జి. శివాన్ష్ రెడ్డి, వి. సహస్ర, 4వ తరగతి, సిద్విక్ నార్ల. పి. క్రిష్ణ చైతన్య శ్రీ, 6వ తరగతి, జి. ప్రన్మాయ రెడ్డి, శ్రీహిత చెట్టిరెడ్డి, శ్లోక పున్నం, 7వ తరగతి, యం. అతీష్ పటేల్, 8వ తరగతి, సి.హెచ్. సహస్ర 9వ తరగతి, మరికొందరూ విద్యార్థులు ఘనవిజయం సాధించారని సంతోషం వ్యక్త పర్చారు.విజేతలకు పుష్పగుచ్చాలతో పాటు మెమెంటోలను అందజేసి భవిష్యత్తులో నిర్వహి ంచబోయే మరిన్ని బహుమతులు సాధించి ప్రతిభను పెంపొందించుకోవాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ , ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
జగిత్యాల
గురువారం 21 మార్చి 2024 4

# దయానీయ పరిస్థితుల్లో మామిడి రైతులు

**- ఎకరానికి రూ 25 వేలు నష్ట పరిహారం ఇవ్వాలి**

**- రైతు బంధు వెంటనే విడుదల చేయాలి - ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్**

**సూర్య జగిత్యాల**

జిల్లాలో మామిడి రైతులు దయానీయ పరిస్థితుల్లో ఉన్నారని ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల మోతే రోడ్డు లోని బి అర్ ఎస్ పార్టీ కార్యాలయం లో బుధవారం ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 35 వేల ఎకరాల్లో మామిడి పంట సాగు చేయగా సుమారు 32 వేల ఎకరాల్లో తామర పురుగు, తేనే మంచు సోకి పంటలు దెబ్బతినే పరిస్థితి ఉందన్నారు. మామిడి సాగు చేసి నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ 25 వేలు నష్ట పరిహారాన్ని ప్రభుత్వం చెల్లించాలన్నారు. అదేవిధంగా వరి, మొక్క జొన్న పంటలకు మద్దతు ధరతో పాటు



క్వింటాల్ కి 500 బోనస్ ఇవ్వాలన్నారు. ఎస్సారెస్పీ లో మిగిలి ఉన్న 19 టి ఎం సి ల నీటిని దిగువకు విడుదల చేసి చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించాలన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో లో పేర్కొన్న విధంగా మొక్కజొన్న కు రూ 330, వరికి రూ 500 బోనస్ చెల్లించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ మాయమాటలు చెప్పి గెలిచారని, ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు గడిచినా 4000 కు పెన్షన్ పెంపు,మహిళలకు రూ 2500 పెన్షన్ ఇవ్వడం లేదన్నారు. లోక్ సభ ఎన్నికలు సమీపి స్తున్న నేపథ్యంలో ఇచ్చిన వాగ్ధానాలు అమలు చేసి మరోసారి గెలవాలని హితవు పలికారు. అలాగే 10 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులకు వెంటనే రైతుబంధు విడుదల చేయాల న్నారు. ఈ కార్యక్రమంలో దావా సురేష్, జెడ్పీటీసీ మహేష్, వైస్ ఎంపీపీ రాజేంద్రప్రసాద్, జంబర్తి శంకర్, రాజీ రెడ్డి,శేకర్ రెడ్డి, గంగారెడ్డి, హరీష్,బాల ముకుందం, అరిఫ్, బిక్షపతి, లక్ష్మణ్, సతిరెడ్డి,వంశీ బాబు,ఏనుగుల రాజు, తదితరులు పాల్గొన్నారు.

## గృహ జ్యోతి నమోదుకు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న మహిళలు

**సూర్య కోరుట్ల రూరల్**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారంటీ పథకాల కోసం నమోదు చేసుకోవడానికి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న మహిళలు. అన్ని పథకాలకు అర్హతలు ఉన్న రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగడం తప్పడం లేదని కోరుట్ల మండలంలోని గ్రామ మహిళలు వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగు రోజులుగా స్థానిక ఎంపీడీవో ఆఫీస్ ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు కార్యాలయంలో పడి కాపులు కాస్తున్న అధికారులు స్పందించడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గృహ జ్యోతి పథకం లో భాగంగా అర్హత పొందిన 500 వండలకే సిలెండరు, జీరో బిల్లు రాక ఆందోళన చెందుతున్నారు. తిరిగి దరఖాస్తు చేసుకోవడానికి కార్యాలాలకు వెళితే అరకొర వసతులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన దరఖాస్తులను స్వీకరించి ఆరు పథకాలు అమలు చేయాల్సి ఉండగా, గృహ జ్యోతి పథకంలో భాగంగా 500 వందలకే సిలెండరు పథకం అస్తవ్యస్థగ కొనసాగుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కార్యాలయానికి వచ్చిన మహిళలకు సౌకర్యాలు కల్పించాలని, వారు కోరుతున్నారు.

## దేవాలయ నిర్మాణానికి భూమిపూజ

**సూర్య జగిత్యాల టౌన్**



జగిత్యాల ఉప్పరిపేట పద్మనాయక వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీదాసాంజనేయ స్వామీ దేవాలయం భూమి పూజ, శంకు స్థాపన మహోత్సవం కార్యక్రమం బుధవారం నిర్వహిం చగా మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం నాయకులను పద్మనాయక వెలమ సంక్షేమ సంఘం సభ్యులు సన్మానిం చారు. వారి వెంట మాజీ మున్సిపల్ చైర్మన్లు గిరి నాగభూషణం, టి. విజయ లక్ష్మి దేవేందర్ రెడ్డి, కౌన్సిలర్ నక్క జీవన్, మాజీ కౌన్సిలర్ అల్లాల సరిత పాల్గొన్నారు.



## ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు విలువ కీలకం

**సూర్య కొడిమ్యాల**

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలో నిర్వహిస్తున్నటువంటి ఏడు రోజుల ప్రత్యేక శిబిరంలో భాగంగా నేడు ఐదవ రోజు ఉదయం శ్రమదాన కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సాయి నగర్ లోని వీధులలో గల చెత్తా చెదారాలను, వ్యర్థ పదార్థాలను, పిచ్చి మొక్కలను తొలగించారు. సాయిబాబా దేవాలయం దాని పరిసరాలను శుభ్ర పరిచారు. మధ్యాహ్న కార్యక్రమంలో భాగంగా శాతవాహన విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఈ. మనోహర్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు యూనిఫామ్ లేని సైనికులు అని కొనియాడుతూ సమాజంలో ఓటరు చైతన్యాన్ని తీసుకురావాలని సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు విలువ కీలకమని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్. శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవా భావాన్ని కొనియాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతాయుత పౌరులుగా ఎదుగుతూ నవ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కొడిమ్యాల గ్రామంలో ఓటర్ అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ ఆర్. గోపికృష్ణ,కే. సతీష్ కుమార్, మాజీ ఉపసర్పంచ్ జి. జీవన్ రెడ్డి, ఎంపీటీసీ మహేష్, అధ్యాపకులు అలీఖాన్, శ్రీనివాస్,సాగర్, శ్రీనాథ్,మోహన్ ప్రసాద్ ,మహేందర్, జాశ్వంత్ సింగ్,ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



## డంపింగ్ యార్డ్ ను తనిఖీ చేసిన మున్సిపల్ చైర్పర్సన్

**సూర్య జగిత్యాల**

జగిత్యాల పట్టణ పరిధిలోని డంపింగ్ యార్డు ను మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ బుధవారం తనిఖీ చేశారు. జగిత్యాల పట్టణంలోని వార్డుల్లో సేకరించిన తడి, పొడి చెత్తను ఎప్పటికప్పుడు సేకరించి మున్సిపల్ వాహనాల ద్వారా డంపింగ్ యార్డు కు తరలించాలన్నారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ అక్కడ జరుగుతున్న చెత్త నుండి తడి పొడి చెత్త ద్వారా వర్మీ కంపోస్ట్ , ప్లాస్టిక్ రెసైక్లింగ్ చేసే విధానాన్ని పరిశీలించారు.

## ప్రభుత్వ విప్ కు గంగ పుత్రుల సన్మానం

**సూర్య - కథలాపూర్**

రాష్ట్ర మత్య పారిశ్రామిక సహకార సంఘాల సమైక్య ఛైర్మెన్ గా మెట్టు సాయి కుమార్ ను నియమించినందుకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను గంగ పుత్రుల నాయకులు శాలువా తో సన్మానించారు. బుధవారం ఎమ్మెల్యే నివాసంలో జగిత్యాల జిల్లా ఫిషర్మెన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోపారపు రజనీ కాంత్, ఫిషర్మేన్ రాష్ట్ర కార్యదర్శి కల్లెడ గంగాధర్, ధర్మపురి నియోజక వర్గం వెలగటూర్ మండల అధ్యక్షుడు గుమ్ముల వెంకటేష్ కలిసి పుష్ప గుచ్చం అందించారు.ఈ సందర్భంగా జగిత్యాల నియోజక వర్గం ఫిషర్మేన్ కాంగ్రెస్ కార్యదర్శి గుమ్ముల రాజేష్, గంగపుత్రుల సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.



# బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**సూర్య- కోరుట్ల**

బీడీ కార్మికులకు వేతనాలు పెంచాలని ఇతర సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లు భోగా గోవర్ధన్, సుతారి రాములు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం సి ప్రభాకర్ భవన్ లో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్, కరీంనగర్, మెదక్ ,అదిలాబాద్, వరంగల్ ఉమ్మడి జిల్లాల పరిధిలోని బీడీ పరిశ్రమలలో పనిచేస్తున్న ఏడు లక్షల మంది బీడీ కార్మికులు చాటన్ ప్యాకింగ్ నెలసరి ఉద్యోగులకు రెండు సంవత్సరాల వేతన ఒప్పంద కాలపరిమితి మార్చి 31 తో ముగుస్తున్నందున ప్రస్తుతం రోజురోజుకు ధరలు పెరిగిపోయినందున 1000 బీడీలకు మూల వేతనం 300 రూపాయలు పెంచాలన్నారు. 1994లో చేసుకున్న ఒప్పందం ప్రకారం వీడిఏ ఒక పాయింట్ కు పది పైసలు ఉన్నందున దానిని 20 పైసలకు పెంచాలని పిఎఫ్ లేని బీడీ కార్మికులందరికీ పిఎఫ్ నెంబర్లు ఇవ్వాలని బీడీ కార్మికులకు నాసిరకం తొలి కాక మూలంగా ప్రతిరోజు పొట్టి పోతున్నందున కటింగ్ బేసిక్ కత్తిరించి ఆకు అవేరేజ్ పెంచాలని డిమాండ్ చేశారు. కొన్ని కంపెనీలు నెలలో 15 రోజులు వారికి పని ఇవ్వడం మూలంగా గ్రాడ్యుటి చెల్లింపు



సమయంలో అన్యాయం జరుగుతుందన్నారు. కాబట్టి ఎన్ని సంవత్సరాలు చేస్తే అంత లెక్క కట్టి గ్రాటూటీ ఇవ్వాలని అన్నారు .పై సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్రంలోన బీడీ యజమానుల సంఘం నిజాంబాద్కు డిమాండ్ నోటీసు ఇవ్వడం జరిగిందన్నారు .ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నేతలు ఎండి ముఖరం, కొక్కుల శాంత ,కెవి అన సూయ, భాను ప్రసాద్, దీకొండ శ్రీనివాస్ ,అన్నం రాదా, ఆదే రంగారెడ్డి పాల్గొన్నారు.

### బీడీ టేకేదారులకు కమిషన్ రేటును పెంచాలని డిమాండ్.....

బీడీ పరిశ్రమలలో పనిచేసే బీడీ టేక్ కేర్ దారులకు బీడీ యజమాన్యాలకు వారధిగా పనిచేస్తున్న వారికి కమిషన్ రేట్లు పెంచాలని కమిషన్ దారుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు సుతారి రాములు డిమాండ్ చేశారు. బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రెండు సంవత్సరాలకు కుదుర్చుకున్న ఒప్పంద గడువు మార్చి 31 తో ముగుస్తుందన్నారు. మార్కెట్లో నిత్యం పెరుగుతున్న ధరలు ఎగుమతి దిగుమతి రవాణా ఖర్చులు పెరిగిపోయినందున 1000 బీడీలకు 18 రూపాయల నుండి 30 రూపాయలకు పెంచాలని కోరారు గతంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం డిపాజిట్ డబ్బులను బ్యాంక్ ఫిక్స్ చేసి వడ్డీ రూపాలను ఇవ్వాలని పేర్కొన్నారు లేబర్ లైసెన్సు ఇంటి అద్దెలు మున్సిపల్ టాక్సీలు యజమానులే భరించాలని నాన్ పిఎఫ్ కార్మికులకు పిఎఫ్ నెంబర్లు ఇవ్వాలని కొన్ని బీడీ కంపెనీలు టేకదారులకు ఇచ్చే కమీషన్లలో 8 రూపాయల కోతలు రద్దు చేయాలని బీడీ కమిషన్ దారుల ద్వారా చిప్స్ పాకెట్లు పిటారాలను నిలిపివేయాలని ఇతర డిమాండ్లతో కూడిన పత్రమును బీడీ మ్యానుఫ్యాక్చర్ అసోసియేషన్ నిజాంబాద్ గార్లకు అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీడీ కమిషన్ దార్ల గౌరవ సలహాదారులు భోగా గోవర్ధన్, ఎండి ముఖరం, భాను ప్రసాద్ ,డి శ్రీనివాస్, ఆదే రంగారెడ్డి కె.వి అనసూయ, కొక్కుల శాంత, శంకర్, మల్లారెడ్డి ,రవి ,వెంకన్న, సాంబయ్య ,నరసయ్య, భూమయ్య ,రాజేశం, లక్ష్మణ్, పరంధామం ,రమేష్ ,లింగం, బాపురావు ,శంకర్ ,శేఖర్, లక్ష్మీనారాయణ ,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





# నిషేధిత ప్లాస్టిక్ సామాగ్రి స్వాధీనం

**- హానికరమైన ప్లాస్టిక్ వినియోగిస్తే జరిమానా తప్పదు - నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్**

**సూర్య-గోదావరిఖని:** పట్టణంలో నిషేధిత ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లు, గ్లాసులు, స్వీట్ హౌస్, బేకరీలలో, కిరాణా సామాగ్రి ప్యాకింగ్‌కు ఉపయోగించే కవర్లు వంటి నిషేధిత ప్లాస్టిక్ సామాగ్రిని బుధవారం రామగుండం నగరపాలక సంస్థ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ మధుకర్ పలు దుకాణాలలో తనిఖీలు నిర్వహించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇక్కడి నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ మాట్లాడుతూ ఒక సారి వాడి



పడేసే ప్లాస్టిక్ సంచులు, కవర్ల వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందంటూ పర్యావరణహితులు ఏళ్ల తరబడి ఉద్యమాలు చేస్తూనే ఉన్న వ్యాపారస్తుల్లో మార్పు రావడంలేదని అన్నారు. నగరంలో ప్లాస్టిక్ నిషేధం పూర్తి స్థాయిలో అమలు జరిగేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, వ్యాపారస్తులు వారు విక్రయించే సామాగ్రిని వినియోగదారులకు ఇచ్చే సమయంలో ప్లాస్టిక్ సంచులు ఉపయోగించరాదని స్పష్టం చేశారు. ఇందుకు ప్రజలు తమకు సహకరించాలని కమిషనర్ కోరారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరన్నా హానికరమైన ప్లాస్టిక్ సంచులను నగరంలో వినియోగిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.



## రైతులకు టి వి ఎస్ మోపెడ్‌ల పంపిణీ

**సూర్య-పెద్దపల్లి రూరల్**

గ్రోమర్ బ్రాండ్ ఎరువులకు ప్రసిద్ధి చెందిన కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఇటీవల ముగిసిన గ్రోమోర్ రైతు సంబరాల్లో భాగంగా రైతులకు టి వి ఎస్ మోపెడ్‌ల పంపిణీ చేశారు. స్లాబ్-ఆధారిత పథకం, కంపెనీ యొక్క ప్రసిద్ధ ఎరువుల గ్రేడ్‌లు గ్రోమోర్ 20.20.0.13 మరియు పారమ్‌ఫోస్‌లను కొనుగోలు చేసిన తర్వాత రైతులకు లక్కీ డ్రా ద్వారా బహుమతి ఇవ్వడానికి రూపకల్పన చేశారు. చందపల్లి లో జరిగిన సమావేశంలో 8 మంది రైతులకి టీవీఎస్ మోపెడ్స్ ని కంపెనీ సీనియర్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ భాస్కర రెడ్డి అందించారు. కార్యక్రమంలో సీనియర్ అసోసియేట్ వీపీ, శ్రీ పి భాస్కర రెడ్డి, సీనియర్ జోనల్ మేనేజర్ సజన్ కుమార్ , ఏపీ, తెలంగాణ బ్రాండింగ్ మేనేజర్‌తో కలిసి మాట్లాడుతూ నాణ్యమైన వ్యవసాయ ఇన్‌పుట్‌లు, పంట సలహాలు మరియు ఇతర సేవలను అందించడం ద్వారా తెలంగాణ రైతాంగానికి సేవ చేయగలుగుతున్నందుకు కోరమాండల్ గర్వపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కుమార్ , సీనియర్ జోనల్ మేనేజర్ సజన్‌కుమార్, సీనియర్ మేనేజర్ ప్రియతం స్వామి, డాక్టర్ సుధాకర్ రెడ్డి, సీనియర్ అగ్రానమిస్ట్ వినోద్ ,జిల్లా మేనేజర్లు రాహుల్, రాజేష్, సురేష్, ఇందులో ఫర్టిలైజర్స్ డీలర్లు ఓం సాయి సురేష్, వరప్రసాద్, రవి శ్రీనివాస్ , మల్లేష్ , పృథ్వి రైతులు, పాల్గొన్నారు.

## లక్కీడ్రా లో రైతుకు ద్విచక్రవాహనం

**సూర్య, సెంటినరీ కాలనీ**

రామగిరి మండలంలోని లద్నాపూర్ గ్రామంలోని డీసీఎంఎస్ ఫెర్టిలైజర్ షాప్ ద్వారా రైతు సంబరాల్లో భాగంగా కోరమండల్ కంపెనీ వారు బహుమతి కూపన్ల అందజేశారు. ఈ బహుమతి కూపన్ల తో రామయ్య పల్లె గ్రామానికి చెందిన రైతు



కేశవేణి కుమార్ కు సుమారు రూ.85 వేల విలువగల ద్విచక్ర వాహనాన్ని బహుమతిగా పొందారు. కోరమండల్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ డీసీఎంఎస్ ఫెర్టిలైజర్ షాప్ ధర కోరమండల్ 20-20-0-13 ఎరువులను విక్రయించగా ఎరువుల బస్తాలకు రెండు బస్తాలకు గాను ఒక ఉచిత బహుమతి కోపాలను అందజేయగా బుధవారం డ్రా ఓపెన్ చేయగా కేశవేన కుమార్ కు కు ద్విచక్ర వాహనం గెలుపొందాలని ఆయన తెలిపారు. రైతులకు కోరమండల్ కంపెనీ ద్వారా అనేక రకాల ఎరువులను క్రిమిసంహారక మందులను అందిస్తుందని రైతులు వినియోగించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జోనల్ మేనేజర్ సాజన్ పెద్దపల్లి జిల్లా డిప్యూటీ మేనేజర్ రాహుల్ కుమార్ డీసీఎంఎస్ ఫెర్టిలైజర్ షాప్ నిర్వాహకులు గిరవెన రాజ కొమురయ్య మార్కెటింగ్ డెవలప్మెంట్ మేనేజర్ లు పాల్గొన్నారు.



## బిజెపిలో చేరిన బిఆర్ఎస్ నాయకులు

**సూర్య-పెద్దపల్లి రూరల్**

మండలం లోని రాఘవపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్, కాంగ్రెస్, బిఎస్పి పార్టీకి చెందిన యువకులు, గ్రామస్తులు పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, జాతీయ కౌన్సిల్ సభ్యులు గుజ్జుల రామక్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో బిజెపిలో చేరగా, వారికి కాశాయ కండువా కప్పి గుజ్జుల పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతిరహిత పాలన అందిస్తూ దేశ కీర్తిని విశ్వవ్యాప్తం చేయడం ద్వారా భారత ప్రధాని నరేంద్ర మోదీ తిరుగులేని నేతగా ఎదిగారని తెలిపారు. రాబోయే లోక్ సభ ఎన్నికల్లో నాలుగువందల స్థానాలను కైవసం చేస్తుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. పెద్దపల్లి పార్లమెంటులో కమలం జెండాను ఎగురవేస్తామని స్పష్టం చేశారు. ఎన్నికలకు ముందుగానే కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు చేతులెత్తేశాయని బిజెపి గాలిలో రెండు పార్టీలు కొట్టుకుపోనున్నాయని అన్నారు. మూడవసారి మోదీని ప్రధానిగా చేయడం కొరకు ప్రతీ కార్యకర్త కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ బిజెపి నాయకులు ఠాకూర్ రాంసింగ్, పిన్నింటి రాజు, పల్లె సదానందం, పర్స సమ్మయ్య, అక్కెపల్లి క్రాంతి, మొలుగూరి రాజవీరు, కాసనగొట్టు విజయ్, ముస్త్యాల సంతోష్, మొహమ్మద్ ఫహీం, కోనేటి సదయ్య, దూలం సతీష్, కాసుల సతీష్, దొడ్ల శ్రీనివాస్, సత్తయ్య, బిల్డర్ సత్తి, నరసిమ్హులు, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



## ఆదివరాహ సన్నిధిలో ఎమ్మెల్యే పూజలు

**సూర్య, సెంటినరీ కాలనీ**

కమాన్పూర్ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఆదివరహ స్వామిని సిర్పూర్ బిజెపి ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు దర్శించుకున్నారు. వేదపండితులతో ఆశీర్వచనం నిర్వహించారు. అలాగే బిజెపి పెద్దపల్లి జిల్లా సీనియర్ నాయకులు దండే లక్ష్మి నారాయణ శాలువాతో ఎమ్మెల్యే హరీష్ బాబు ని సన్మానించారు.

## ఉపాధి హామీ పనులు పరిశీలించిన ఎంపీడీవో

**సూర్య, సెంటినరీ కాలనీ**

రామగిరి మండలం చందనాపూర్ గ్రామంలో ఉపాధి హామీ పనులను బుధవారం ఎంపీడీవో బి.శైలజ రాణి పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పని చేయించాలని, పని స్థలాల వద్ద సౌకర్యాలు కల్పించాలని ఆమె సూచించారు. వేసవి కాలం కావడంతో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయించాలని అన్నారు. ఈమె వెంట టెక్నికల్ అసిస్టెంట్ మల్కా అఖిల, పంచాయతీ సెక్రటరీ స్వాతి పాల్గొన్నారు.

## అంగన్వాడి సూపర్వైజర్ మృతి

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం కలవచర్ల గ్రామానికి చెందిన అంగన్వాడి సూపర్వైజర్ రేండ్ల స్వరూప బుధవారం అనారోగ్యంతో మృతి చెందింది. గత కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ, వరంగల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. హార్ట్ స్ట్రోక్ తో మృతి చెందింది. ఈమె గ్రామంలో అంగన్వాడీ టీచర్ గా నిర్వహిస్తూ,2022 నవంబర్ లో అంగన్వాడి సూపరవైజర్ గ్రేడ్-2 గా పదోన్నతి పొందింది. ప్రస్తుతం ఈమె మంథని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ లోని ముత్తారం మండలం లో సూపర్వైజర్ గా పనిచేస్తుంది. జిల్లా పీడీ రౌఫ్ ఖాన్,మంథని ఇంచార్జి సీడీపీఓ స్వరూప రాణి, ఉమ్మడి కమాన్పూర్ మాజీ జడ్పీటీసీ గంట వెంకట రమణారెడ్డి, అంగన్వాడీ సూపర్వైజర్లు కొప్పుల అనిత, మాటెటి. శారదా,లక్ష్మీ, స్వప్న, జూనియర్ అస్సిటెంట్ కృష్ణ, ఆసిఫ్, మాజీ వార్డు సభ్యులు బూస బాపన్న, మాజీ ఉప సర్పంచ్ కనకయ్యలు మృతదేహానికి నివాళులర్పించి, ప్రగాఢ సంతాపం వెళ్లబుచ్చారు.



## సౌర విద్యుత్ కేంద్రం పనులను త్వరితగతిన పూర్తి చేయండి

**-జీఎం(సోలార్) జానకిరామ్**

**సూర్య, సెంటినరీ కాలనీ**

ఆర్జీ-3 ఏరియాలోని ఓసీపీ-1 ఉపరితల గని ఓ.బి డంపు పై నూతనంగా ఏర్పాటు చేస్తున్న 22 మెగావాట్ల సౌర విద్యుత్ కేంద్రం అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సోలార్ జీఎం జానకిరామ్ అన్నారు. బుధవారం ఆయన జీఎం కార్యాలయం నందు ఆర్జీ-3 జీఎం నరేంద్ర సుధాకర రావు, ఏరియా ఇంజనీర్ పాలపర్తి ఎలీషా లతో పాటు సంబంధిత అధికారులతో, కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా నిర్మిస్తున్న 22 మెగావాట్ల సౌర విద్యుత్ కేంద్రం పనులు మే 15 తారీకు వరకు పూర్తి అయ్యే విధంగా తగిన ప్రణాళికలను, చర్యలను చేపట్టాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్లకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీజీఎం శ్రీనివాస్, ఎస్ఈ శ్రీనివాస్ రెడ్డి లతో పాటు సోలార్ కాంట్రాక్టు ఉద్యోగులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులపై దాడిని ఖండిస్తూ నిరసన

**సూర్య ఓదెల**

నాగర్ కర్నూలు జిల్లా కోడేరులో ఎంపీఓ పై జరిగిన దాడికి నిరసనగా ఉద్యోగులు మండల పరిషత్ కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ మండల అధ్యక్షుడు మోడీకే కిరణ్ ఆధ్వర్యంలో ఉద్యోగులు, ఎంపీపీ దాడి చేయడాన్ని ఖండిస్తూ ఎంపీపీ వైఖరిపై తమ నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తిరుపతి, ఎంపీఓ భాస్కర్, సూపరిండెంట్ శ్రీధర్, తెలంగాణ పంచాయతీ సెక్రెటరీ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ముత్యాల సందీప్, జిల్లా ఉపాధ్యక్షుడు భాను ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం పరిశీలన

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలంలోని బేగంపేట గ్రామంలో గల జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందజేసే మధ్యాహ్న భోజనాన్ని బుధవారం పరిశీలించినట్లు రామగిరి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి శివ తెలిపారు.స్వయంగా ఆహారాన్ని రుచి చూసి మెనూ ప్రకారం విద్యార్థులకు పోషకాహారాన్ని అందజేయాలని ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఇల్లందుల సంజీవ్ దుర్కి కొమురయ్య బొంతల రమేష్ అంకతి రాజేందర్ కెక్కర్ల సతీష్ బరపటి రాజేశంలు పాల్గొన్నారు.

# సోషల్ వెల్ఫేర్ గురుకుల బాలిక పాఠశాలలో విద్యార్థులకు భద్రత లేదు

## - పి.డి.ఎస్.యు ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు అంగిడి కుమార్

**సూర్య, జమ్మికుంట రూరల్**

జమ్మికుంట మండలంలోని గంగ్రపల్లి గ్రామంలో గల సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలను బుధవారం పి.డి.ఎస్.యు ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అంగడి కుమార్ సందర్శించి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. పూర్తిగా భవనం నిబంధనలకు విరుద్ధంగా ఉండడం వలన విద్యార్థులకు చాలా ఇబ్బందులు కలుగుతున్నాయని, వర్షం నీరు రావడం వలన దుర్వాసన వచ్చి విద్యార్థులు అనారోగ్యాలకు కూడా గురి కావడం జరుగుతుందని అన్నారు. వంటగది నుంచి భోజనం తినే క్రమంలో విద్యార్థులు వెళ్లే మార్గంలో ఎండ తీవ్రత వల్ల విద్యార్థులకు



వడదెబ్బ తాకే అవకాశం ఉందని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా క్యాట్ రింగ్ సిబ్బందిని భర్తీ చేయాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లను పెంచాలని అన్నారు. విద్యుత్ తీగలు కూడా కింద వేలాడుతూ ఉన్నాయని, కరెంట్ షాక్ వచ్చే అవకాశాలు ఉన్నాయని, వాటిని సేఫ్టీ విధానంలో అమర్చాలని సూచించారు. సీసీ కెమెరాలు కూడా పనిచేయడం లేదని, వెంటనే వాటిని మరమ్మతులు చేయించాలన్నారు. సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలకు సొసైటీ కి సంబంధించిన అధికారులు ఆ యొక్క భవనాన్ని ఖాళీ చేసి అన్ని మౌలిక వసతులు ఉన్నటువంటి భవనానికి మార్చాలని, సొంత భవనాన్ని నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని యెడల ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు నాయకులు గుజ్జుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.



# మైదానాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

## - మున్సిపల్ చైర్పర్సన్

**సూర్య జగిత్యాల**

జగిత్యాల పట్టణంలోని హౌసింగ్ కాలనీలో గల గీత విద్యాలయం మైదానాన్ని పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ పారిశుద్ధ్య కార్మికులను ఆదేశించారు. బుధవారం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, విద్యాలయ యాజమాన్యం వారు మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలోని గీత విద్యాలయం చుట్టూ ఉన్న చెత్తను ప్లాస్టిక్ కవర్స్ పిచ్చి చెట్లను తొలగించాలని చైర్పర్సన్ ని కోరారు. అలాగే వాకర్స్ అసోసియేషన్ సభ్యులు వాకింగ్ ట్రాక్ కొంత పాటు అభివృద్ధి చేయాలని కోరగా త్వరలోనే అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు.



# భారత్ రైస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

**సూర్య,,కోరుట్ల టౌన్.**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారద్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన లిభారత్ రైస్లి పథకంలో భాగంగా కోరుట్ల పట్టణంలోని భీముని దుబ్బ ప్రాంతంలో గల భారత్ రైస్ కేంద్రాన్ని సందర్శించి కొనుగోలు చేయడం జరిగింది.ఇట్టి భారత్ రైస్ పథకంతో పేద,మధ్య తరగతి ప్రజలకు నాణ్యమైన బియ్యం అతి తక్కువ ధరలకే లభిస్తుందని,ప్రతి ఒక్క కుటుంబం మూడు పూటలా భోజనం చేయొచ్చనీ అలాగే ఆ కుటుంబం పైన అధిక భారం పడకుండా ఉపయోగపడుతుందనీ ఈ పథకంలో భారత్ రైస్ కొనుగోలు చేసి వినియోగించుకోవాలని బీజేపీ మున్సిపల్ కౌన్సిలర్ పెండెం గణేష్ కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బెజ్జారపు చందు జక్కుల ప్రవీణ్, గందె నవీన్ బీజేవైఎం అధ్యక్షులు కలాల సాయి చందు,రంజిత్ రావు,గుండేటి సంజీవ్,గుండేటి సాయి పాల్గొన్నారు..

# కోడ్ కూసినా మేల్కొలేరా

**సూర్య మల్లాపూర్**



ఎలెక్షన్ కోడ్ విడుదలై నాలుగు రోజులు కావస్తున్నా మండలం లోని పలుగ్రామాల్లో మేల్కొని అధికారులు ఎన్నికల నియమావళిని గాలికి వదిలి వేశారు. మండలంలోని ఓబులాపుర్ గ్రామంలో అధికారా, ప్రతిపక్ష బీఆర్ఎస్ ఫ్లెక్సీలను, గోడ వ్రాతలను తొలగించిన పంచాయతీ కార్యదర్శి బిజెపి కి సంబంధించిన గోడ వ్రాతలను తొలగించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఓబులాపుర్ గ్రామం అసలే అంతర్ జిల్లా సరిహద్దు ఎలక్షన్ కోడ్ లో భాగంగా చెక్ పోస్ట్ నిర్వహించిన గ్రామంలోనే ఎలక్షన్ కోడ్ పాటించకుండా ఆ అధికారి వ్యవహరించడంతో ఆ పార్టీ పై అధికారి మక్కువ చూపిస్తూన్నార అని మిగత పార్టీల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ నియమావళిని తుచ పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నా జిల్లా, మండల స్థాయి అధికారులు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తారా సంబంధిత అధికారి పై చర్యలు తీసుకుంటారా వేచి చూడాలి.

# కాలబైరవుని ప్రతిరూపం శునకానికి పూజలు

**సూర్య జగిత్యాల టౌన్**



జగిత్యాల జిల్లా కేంద్రంలోని తులసి నగర్ లో ఆకుల నాగరాజు ఇంట్లో శునకానికి వాణి నగర్ కు చెందిన నాగమల్ల. రాజేశం - అనంతలక్ష్మి దంపతులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శునకానికి శుద్ధమైన నీటితో స్నానం చేపించి పసుపు, కుంకుమ బొట్లు పెట్టి పూల మాల శునకం మెడలో వేశారు. అనంతరం స్వీట్లు, పిండి వంటలు నైవేద్యంగా సమర్పించారు. కాశి పర్యటన తరువాత కాలాబైరవుని ప్రతి రూపానికి పూజలు చేయడం ఆనవాయితీ అని, ఈ నేపథ్యంలో శునకానికి పూజలు చేస్తున్నామని రాజేశం - అనంతలక్ష్మి దంపతులు తెలిపారు. అయితే శునకానికి ప్రత్యేక పూజలు చేయడాన్ని ప్రజలు ఆసక్తిగా తిలకించారు.



# రైస్ మిల్లును ప్రారంభించిన ప్రభుత్వ విప్

**సూర్య - కథలాపూర్**

మండలంలోని దూలుర్ గ్రామం నూతనంగా నిర్మించిన మురళి కృష్ణ రైస్ మిల్లును బుధవారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ , కోరుట్ల నియోజక వర్గం ఇంఛార్జి జువ్వాడి నర్సింగా రావు తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ,వినియోగదారులకు మెరుగైన సేవలను అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఆనంతరం భూషణ్ రావు పేట లో నిర్వహిస్తున్న కథలాపూర్ మండల ప్రీమియం లీగ్ సీజన్ 2 క్రికెట్ ను ప్రారంభించి యువత చెడు మార్గంలో వెళ్లకుండా క్రీడల పట్ల ఆసక్తి కనబరచలని, మండలం నుండి రాష్ట్ర స్థాయి ఆటలకు అర్హత సాధించేలా ఆడాలని ఆకాంక్షించారు. అంతకుముందు ఎమ్మెల్యే శ్రీనివాస్ ను , జువ్వాడి నర్సింగారావు లను శాలువా లతో రైస్ మిల్లు నిర్వాహకులు లింగా ఉదయ్ సన్మానించారు.ఈ కార్య్ర కమంలో మండల పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, చెదలు సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీమ్, అల్లూరి దేవా రెడ్డి, వెగ్యారపు శ్రీహరి, గోపిడి ధనంజయ రెడ్డి, బైర మల్లేష్, భైర దేవ్ యాదవ్, న్యావనంది శేఖర్, గుంలాపూర్ తుక్కన్న, జవ్వాజి రవి, క్రీడాకారులు తదతరులు ఉన్నారు.

# పదవ తరగతి' పరీక్ష కేంద్రాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

## - ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాడవేని సునీల్

**సూర్య కోరుట్ల టౌన్**



పదో తరగతి పరీక్షల కేంద్రాలలో విద్యా ర్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి. పరీక్షలు రాసే విద్యార్థులకు పరీక్ష కేంద్రాలలో త్రాగు నీరు సదుపాయం కల్పించాలని, రూంలలో పరిశుభ్రత పాటించాలని కోరారు.అలాగే విద్యార్థులకు పలు సూచనలు చేశారు.విద్యార్థులు పరీక్ష సమయాలు దృష్టిలో పెట్టుకొని ముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని. విద్యార్థులు ఎలాంటి భయం లేకుండా నిశ్చింతగా తాము చదివిన జవాబు పత్రాలలో వ్రాయలని సూచించారు, అదేవిధంగా పరీక్షలు భయంతో కాకుండా బాధ్యత తో వ్రాయాలని అన్నారు.విద్యార్థులకి త్రాగు నీరు,ఏర్పాటు చేయాలనీ పాఠశాల యాజమాన్యలను కోరారు.

# బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన వెంకటేశ్వర స్వామి ఆలయం

**సూర్య చందుర్తి**

చందుర్తి మండలంలో బండపల్లి గ్రామంలో కొలువై ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 23 నుండి 25 వరకు జరగనుండగా అట్టి ఉత్సవాలకు ఆలయాన్ని ఆలయ కమిటీ ఆకర్షనీయంగా రంగులతో తోరణాలతో ఆలయ ఆవరణలో విద్యుత్ దీపాలతో అలంకరణ చేసి ఉత్సవాలకు ముస్తాబు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ రణధీర్ రెడ్డి ,ఆలయ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.







# రిటైర్డ్ ఏఈ మృతి పట్ల వాకర్స్ సంతాపం

**సూర్య, హుజురాబాద్**

ఇటీవల అనారోగ్యంతో పంచాయతీ రాజ్ ఏఈ మునిగంటి వెంకటేశ్వర్లు మృతి చెందడ%శీ% పట్ల బుధవారం హుజురాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో వాకర్స్ అసోసియేషన్ సంతాపం తెలిపారు. మృతుడు వెంకటేశ్వర్లు అందరితో కలివిడిగా ఉండి సంతోషంగా ఉండేవాడని పలువురు అన్నారు. అనంతరం మృతిని కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బ%శీ%డ శ్రీనివాస్, కౌన్సిలర్లు శ్రీనివాస్ గౌడ్, ముక్క రమేష్, వాకర్స్ అధ్యక్షులు గోవర్ధన్, కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, శిల్పి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ వెంకటరాజ%శీ%, వేల్పుల రత్నం, మాజీ అధ్యక్షులు రమేష్, సదానందం, సలీం, సతీష్, విద్యానంద్, సారంగపాణి, మోహన్, హరికిషన్, దశరథం, శ్రీనివాస్, సారయ్య, భాస్కర్, యాదగిరి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా మాజీ మంత్రి ఈటల జన్మదిన వేడుకలు

**సూర్య, వీణవంక**

వీణవంక మండలం వల్భాపూర్ గ్రామంలో మాజీ మంత్రి ఈటల రాజేందర్ జన్మదిన వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఈటల రాజేందర్ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని, రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో మల్కాజ్ గిరి నియోజకవర్గం నుండి భారీ మెజారిటీతో గెలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మారముళ్ల కొమురయ్య, దొమ్మటి రాజమల్లు, పోతరాజు మహేందర్, నామని విజేందర్, ఎట్టపు మహేష్, బొరగళ్ళ పోశాలు, పల్లేవెన కుమార్, ఊకంటి సత్యం, జీడి రాజు, బుర్ర రామ స్వామి, కొంగల బక్కయ్య, మారముళ్ల సమ్మయ్య, సతీష్, న్యాలి శ్రావణ్, నామని సాయి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్ తో రైతు మృతి

**సూర్య ఓదెల**

ఓదెల మండలం కనగర్తి గ్రామంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తో గుండారం రాజయ్య అనే రైతు మృతి చెందాడు. మంగళవారం రాత్రి ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో పొలం గట్టుపై విద్యుత్ తీగలు తెగి పడడంతో బుధవారం ఉదయం రైతు రాజయ్య పొలం పనులకు వెళ్లగా విద్యుత్ తీగలు తగిలి రాజయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన స్థలికి పోత్కపల్లి ఎస్సై అశోక్ రెడ్డి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఇంటి వంట ముద్దు.. బయటి ఆహారం వద్దు..

**- న్యూట్రిషన్, హెల్తీ ఫుడ్ కు ప్రాధాన్యం ఇవ్వండి - జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

ఇంట్లోనే తయారు చేసుకున్న హెల్తీ, న్యూట్రిషన్ ఫుడ్ కు అందరూ ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. బయట దొరికే జంక్ ఫుడ్ ను తీసుకోవడం వల్ల అధిక అనర్థాలు ఉంటాయని తెలిపారు. బుధవారం కరీంనగర్ లోని రెవెన్యూ గార్డెన్ లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషన్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా మగవారికి వంటల పోటీలు నిర్వహించారు. దీనికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్య అతిథిగా హాజరై వంటకాలను రుచి చూశారు. మగవారు చాలా బాగా వంటలు చేశారని అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఫాస్ట్ గా లభించే ఫాస్ట్ ఫుడ్ ను ఎక్కువగా తీసుకోవద్దని, వాటి వల్ల చాలా అనర్థాలు, ఆరోగ్య సమస్యలు వస్తాయని పేర్కొన్నారు. ఇంట్లోనే హెల్తీ ఫుడ్ న్యూట్రిషన్ ఫుడ్ ను తయారు చేసుకొని తినాలని సూచించారు. సంప్రదాయ




వంటకాలపై అధిక దృష్టి సారించాలని, వాటితోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని పేర్కొన్నారు. మహిళలకు వంటల్లో మగవారు కొంత సాయం చేయాలని సూచించారు. మన ఆరోగ్యంలో మనం తీసుకున్న ఆహారమే కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. మహిళలకు దీటుగా మగవారు వంటలు చేయడం నేర్చుకోవాలని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ మహిళలు పోషకాహారాన్ని ఎక్కువగా తీసుకోవాలని పేర్కొన్నారు. కూరగాయలు ఆకుకూరలతో పాటు బలవర్ధకమైన ఆహారం తీసుకుంటూనే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని తెలిపారు. వంటల పోటీల్లో కొత్తపెల్లి సెక్టార్ పరిధిలోని ఆసిఫ్ నగర్ -4 అంగన్వాడీ సెంటర్ కు ప్రథమ బహుమతి లభించింది. సురేష్ వెన్నెల దంపతులు, ఐసిడిఎస్ సూపర్వైజర్ అరుణ, అంగన్వాడీ టీచర్ మెంగాని పద్మలకు జిల్లా కలెక్టర్ బహుమతి అందజేశారు. దీంతోపాటు పలువురికి జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్, అధికారులు, బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, సిడబ్ల్యూసి చైర్ పర్సన్ ధనలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి సుజాత, డీఈవో జనార్దన్ రావు, పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ నాగరాజు, కరీంనగర్ రూరల్ సిడిపిఓ సబిత, అర్బన్ సిడిపిఓ లక్ష్మీనారాయణ, గంగాధర సిడిపిఓ కస్తూరి, అధికారులు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## రైతు ఫిర్యాదుపై సైదాపూర్లో ఇరిగేషన్ డిఈ విచారణ

**- సర్వే పూర్తి అయ్యేంత వరకు ఏలాంటి పనులు చేయద్దని సూచన**

**సూర్య సైదాపూర్ / కరీంనగర్ ప్రతినిధి**

సర్వేయర్ తో సర్వే చెయించెంత వరకు ఏలాంటి పనులు చెపట్టవద్దని ఇరిగేషన్ డిఈ సదయ్య, ఏఈలు ఆంజనేయులు తేలిపారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ సమీపంలోని నాల చేరువు నుండి వచ్చె సాగు నీరు రాకుండా కొంతమంది అక్రమంగా అట్టి కాలువను ముసివేసి సీసీ రోడ్డు నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నారని అదే గ్రామానికి చెందిన పోశెట్టి అజెయ్ కుమార్ అనే రైతు రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అట్టి ఫిర్యాదు మేరకు ఇరిగేషన్ డిఈ సదయ్య, ఏఈలు అంజనేయులు గ్రామానికి చేరుకోని గ్రామస్థుల సమక్షంలో మొఖపై ప్రాథమిక విచారణ చేసి, కాలువలను పరిశీలించారు. చెరువు నుండి వస్తున్న నీటితో భవిష్యత్లో పంటలు వండుతాయని, ఆట్టి కాలువ మూసివేసి సీసీ రోడ్డు పోస్తే తమకు అన్యాయం జరుగుతుందని పలువురు రైతులు అధికారుల ముందు అవేదన వ్యక్తం చేశారు. ఇరువర్గాలు మాటలు విన్న ఇరిగేషన్ అధికారులు రెవిన్యూ అధికారులచే సర్వే చేసేంత వరకు వెచి ఉండాలని అప్పటి వరకు ఏలాంటి పనులు చేపట్టవద్దని ఇరువురికి తెలియజేశారు.



## క్రికెట్ లో సెమి ఫైనల్ జేఎన్టీయూ, వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాల జట్టు

**సూర్య, సెంటినరీ కాలనీ**

మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న బీ-జోన్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ లో కరీంనగర్ కు చెందిన వాగేశ్వరి జట్టు బుధవారం సెమీ ఫైనల్ కి చేరింది. లీగ్ లో ఆడిన రెండు మ్యాచ్ ల్లో ను గెలుపొంది మంథని జట్టుతో జరిగే సెమీ ఫైనల్ కు అర్హత సాధించింది. మొదటి మ్యాచ్ లో జేఎన్టీయూ కొండగట్టు జట్టు, వరంగల్ కు చెందిన జయముఖి జట్టుపై గెలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన కొండగట్టు జట్టు 5 వికెట్లు కోల్పోయి 195 పరుగులు చేసింది. మొహ్మద్ నోమ 48, అఖిల్ 52 పరుగులు చేయగా, అరుణ్ 2 వికెట్లు తీశారు. అనంతరం వరంగల్ జట్టు 7 వికెట్లకు 147 పరుగులు చేసింది. రాకేష్ 52 పరుగులు చేయగా, కన్నయ్య 2 వికెట్లు తీశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా నోమాన్ ఎంపికయ్యారు. రెండో మ్యాచ్ లో వాగేశ్వరి జట్టు కొండగట్టు జట్టుపై పరుగు తేడాతో గెలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన కొండగట్టు చెట్టు 8 వికెట్లకు 120 పరుగులు చేసింది. సాయికిరణ్ 24 పరుగులు చేయగా, మనిరుత్ 4, నదీర్ 2 వికెట్లు తీశారు. కేవలం రెండు వికెట్లు కోల్పోయే లక్ష్యాన్ని చేదించింది. శివమణి 42, వంశీ 51 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా మని చందు ఎంపికయ్యారు. బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి సింగరేణి సంస్థ ఆర్జీ -3 ఏరియా సివిల్ డీజీఎం పీవీఎన్. పద్మరాజు ముఖ్య అతిథులుగా హాజరై మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ లు అందించారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఈ విభాగాధిపతి రామ్ నరేష్, డిఇఇ సతీష్, ఆఫీస్ సూపరిండెంట్ రవికుమార్, ఫిజికల్ డైరెక్టర్లు పింగిలి కృష్ణారెడ్డి, సునీల్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఘనంగా ఈటల జన్మదిన వేడుకలు

**సూర్య, హుజురాబాద్**



హుజురాబాద్ మాజీ శాసన సభ్యులు, మల్కాజ్ గిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ జన్మ దిన వేడుకలు బుధవారం హుజు రాబాద్ పట్టణంలో బిజెపి నాయకులు నిర్వహి ంచారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు తుర్పాటి రాజు, గంగిశెట్టి ప్రభాకర్, యాళ్ళ సంజీవరెడ్డి, ఆంకటి వాసు, తిప్పబత్తిని రాజు, కొలిపాక వెంకటేష్, రాపాక రాజు, యట రాజేష్ ఖన్నా, కుసుమ సమ్మయ్య పాల్గొన్నారు.



## జోరుగా గ్రామాల్లో కోనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణం పనులు

**- మంత్రి పొన్నంకు ధాన్యావాదాలు తెలుపుతున్న నాయకులు**

**సూర్య సైదాపూర్ / కరీంనగర్ ప్రతినిధి**

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయని కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని ఏగ్రామానికి వెళ్లిన సీసీ రోడ్డు నిర్మాణం పనులు జోరుగా సాగుతున్నాయి. రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సైదాపూర్ మండలానికి 3కోట్ల రూపాయాలు సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరి చేయటంతో గ్రామాలు అభివృద్ధి బాటలో నడుస్తున్నాయి. వెంకటేశ్వర పల్లే గ్రామంలో 10లక్షల రూపాయాల నిధులతో వైకుంఠ దామంలో సీసీ పోస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ గ్రామా శాఖ అధ్యక్షులు భాషవేని సంపత్, సీనియర్ నాయకులు ఎర్రల్ల శ్రీనివాస్ తెలిపారు. పెరుకపల్లే గ్రామ పరిధిలోని గుడెంలో 15లక్షల రూపాయాల విలువ గల సీసీ రోడ్డు పనులు చురుకుగా కోనసాగతున్నాయని కాంగ్రెస్ నాయకులు బత్తుల సంపత్,చల్లురి సదానందం, బత్తుల బాలకృష్ణలు తెలిపారు. గ్రామాల అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున నిధులు మంజూరి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ కు కాంగ్రెస్ నాయకులు, కర్యకర్తలు, అభిమానులు ధన్యావాదాలు తెలియజేస్తున్నారు.

## మంత్రివర్య మా భవనం పూర్తి చేయండి..

**-వీర ముష్టి కుల సంఘం నాయకులు**

**సూర్య, సెంటినరీ కాలనీ**



తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు మా యొక్క కుల సంఘ భవనం పూర్తి చేయాలని కమాన్ పూర్ మండలం గుండారం గ్రామ వీరముష్టి (వీరభద్రియ) కుల సంఘాల నాయకులు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును కోరుతున్నారు. కాగా తాము గతంలో సొంతంగా భూమి కొనుగోలు చేశామని వైయస్ హయాంలో శ్రీధర్ బాబు మంత్రిగా ఉన్న సమయంలో దానికి గాను లక్ష రూపాయలు కేటాయించారని పేర్కొన్నారు. ప్రస్తుతం 10 సంవత్సరాల పైగా గోడలు గానే మిగిలి ఉన్నాయని దానికి గాను నిధులు కేటాయించి పూర్తి చేయాలని సంఘం నాయకులు వీరముష్టి గ్రామ శాఖ అధ్యక్షుడు బాణాల తిరుపతి, కడారి రవి, మల్యాల వీరయ్య, వీటి అంజయ్య, కడారి కనకయ్య, మల్యాల శ్రీకాంత్, బాణాల శ్రీధర్, దీటి శ్రీనివాస్, దీటి అశోక్ లు కోరారు.



## ఘనంగా మజీ మంత్రి ఈటల రాజేందర్ జన్మిన వేడుకలు.

**సూర్య సైదాపూర్ / కరీంనగర్ ప్రతినిధి**

బిజెపి పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు,మాజీ మంత్రి ఈటల రాజేందర్ జన్మదిన వేడుకలను బుధవారం కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండల కేంద్రంలో బిజెపి పార్టీ నాయకులు, కర్యకర్తలు, ఈటల అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ వీరఅభిమాని ఈరాల శ్రీనివాస్ మండల కేంద్రంలో కేక్ కట్ చేసి, పండ్లు పంపిణి చేసి అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈరాల శ్రీనివాస్, వెన్కెపల్లి ఎంపీటీసీ సభ్యుడు జంపాల సంతోష్ లు మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి రాష్ట్ర ప్రజల సంక్షేమమం కోసం నిరంతరం పరితపించే వ్యక్తి ఈటల రాజేందర్ అని చెప్పారు. భవిశ్యత్ లో ఈటల రాజేందర్ ఎంతో ఉన్నతస్థాయికి ఎదగాలని, అన్ని వార్గల ప్రజలకు వారి సేవలు అందించాలని వారు ఆకాంక్షించారు. బిజెపి పార్టీని రాష్ట్రం లో మరింత భివృద్ధి పరిచాలని వారు కోరారు. రాబోయె లోక్ సభ ఎన్నికల్లో ఈటెల రాజేందర్ అత్యధిక మోజార్టీతో గెలువబోతున్నారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీ సభ్యులు జంపాల సంతోష్, నాయకులు నెల్లి శ్రీనివాస్,నీర్లా సతీష్, బైరవేని శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ శంకర్, ఎడబోయిన నరేష్, నెల్లి సంపత్, చలివేరి రాజు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గోన్నారు.

## హైనా దాడిలో దూడ మృతి

**సూర్య చిగురుమామిడి....**



చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామానికి చెందిన మర్రి ఐలయ్య అనే రైతు పొలం వద్ద పశువుల పాకలో కట్టేసిన దూడపై మంగళవారం రాత్రి హైనా దాడి చేయగా దూడ మృతి చెందింది. రోజు మాదిరిగానే పొలం వద్దనున్న పశువుల పాకలో దూడను కట్టేసి వెళ్లానని,బుధవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి పశువుల పాకలో చూడగా దూడ మృతి చెందిందని ఐలయ్య విలపించారు. సంబంధిత అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. పాద ముద్రలు హైనవని ధ్రువీకరించినట్లు తెలిపారు. హైనా దాడిలో దూడ కోల్పోయిన రైతు ఐలయ్యను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు రైతులు కోరారు.

# కనుమరుగవుతున్న జాజిరి ఆటలు..!!

- రింగుడు బిల్లా.. రూపాయి దండా..! -బోల్ బోల్ కట్టమీద బొమ్మలాట.. సూడబోదమా ఆడబోదమా ..

- కోతి పుట్టుడెందుకు - కొమ్మ లెక్కటందుకు. - కొమ్మలెక్కుడెందుకు - నార చీరేటందుకు..

సూర్య కాల్వ శ్రీరాంపూర్

**పండుగ ఏదైనా తెలంగాణ పల్లెల్లో దాని శోభ మరింత ప్రత్యేకంగా ఉంటుంది. అసలే పల్లె పదాలతో సాహిత్య పరిమళాలు కొత్త గుబాళింపు వెదజల్లే తెలంగాణలో హెూలీ సందడి అంతా ఇంతా కాదు. అలాంటి హెూలీ సందర్భంగా చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ఆడే జాజిరి ఆట పల్లెల్లో, పట్టణాల్లో కనుమరుగవుతున్న నేపథ్యంలో సూర్య దినపత్రిక ప్రత్యేక కథనం.**

పండుగ ఏదైనా తెలంగాణ పల్లెల్లో దాని శోభ మరింత ప్రత్యేకంగా ఉంటుంది. పిల్లల నుంచి పెద్దల వరకు తమదైన సందడితో ఆ పండగకు మరింత వన్నె తెస్తారు. అసలే పల్లె పదాలతో సాహిత్య పరిమళాలు కొత్త గుబాళింపు వెదజల్లే తెలంగాణలో ఆ సందడి మరింత ఆసక్తికరంగా ఉంటుంది. ఇక ఫాల్గుణ మాసంలో వచ్చే రంగుల పండగ 'హెూలీ' గురించి ప్రత్యేకంగా చెప్ప క్కర్లేదు. ఈ పండగ సమయంలో చిన్నారుల జాజిరి పాటలు తెలంగాణ పల్లెల్లో ఏరులై పారుతాయి.





**జాజిరి పండుగ తొమ్మిది రోజులు.**

కాముని పున్నమి నేపథ్యంలో 9 రోజుల పాటు 'జాజిరి' ఆడటం తరాలుగా వస్తున్న సాంప్రదాయం. చిన్నారులు, యువకులు కర్రలు చేతబూని కోలాటాలాడుతూ, పాటలు పాడుతూ వీధుల్లో ఉత్సాహం నింపుతారు. ఇంటింటికీ తిరుగుతూ కాముని ఆటలు ఆడతారు. నిండు చంద్రుని వెన్నెల వెలుగుల్లో జాజిరి పాటలు తెలంగాణ పల్లెలకు కొత్త అందం తీసుకొస్తాయి. అవి అందర్నీ కవ్విస్తాయి.. నవ్విస్తాయి. యువకులను ఉర్రూతలూగిస్తాయి. ఆ పాటల్లో కష్టాలు ఉంటాయి, కన్నీళ్లూ ఉంటాయి.. అంతులేని ఆనందం కూడా ఉంటుంది. అంతకుమించి లోతైన అర్థం ఉంటుంది. తేలికైన పదాల్లో గొప్ప సందేశం ఇవ్వడం, ఆ అర్థాన్ని సున్నితమైన హాస్యంతో మిళితం చేసి చెప్పడం జాజిరి ప్రత్యేకత. పాటలకే సొంతమైన జాజిరి పాటలు పాడుతూ ఇళ్ల ముందుకు వచ్చే యువకులకు ఆడపడుచులు తమకు తోచిన కానుకలు ఇచ్చి పంపిస్తారు. సాధారణంగా బియ్యం, డబ్బులు కానకలుగా ఇస్తారు. ఇలా 9 రాత్రులు ఆడుకుని చివరి రోజు కామనదహనం చేస్తారు. మరుసటి రోజు రంగులు జల్లుకుంటూ హెూలీ పండగను సంబరంగా జరుపుకొంటారు.

**ఊరి చివరిలో విందు.**

రంగుల్లో తడిసి ముద్దయ్యాక స్నేహితులంతా కలిసి ఊరి చివరి బావుల వద్దకు వెళ్లి ఈత కొడుతూ సందడి చేస్తారు. అనంతరం అక్కడే మంచి నీడ ఉన్న ఓ చెట్టు చూసుకొని కోడికూర, చేపల కూర తదితర మాంసాది కూరలతో అన్నం వండుకొని ఇష్టంగా తింటారు. కొంత మంది అయితే తాటి కల్లు కూడా రుచి చూస్తారు. ఇలా మొత్తం మీద హెూలీ పండగను ఉల్లాసంగా జరుపుకుంటారు.

**పల్లె పదాల సాహిత్యం గుబాళించే జాజిరి పాటలు.**

జాజిరి పాటల్లో పురాణ ఇతిహాసాలకు సంబంధించిన పాటలతో పాటు వ్యవసాయ సంబంధ, శృంగార సంబంధ అంశాలు ఎక్కువగా ఉంటాయి. కోలలు, డప్పులు, చప్పట్లకు అనుగుణంగా, లయబద్ధంగా పాటలు ఉంటాయి. టీవీలు, సెల్ఫోన్లు, కంప్యూటర్ల రాకతో పాత సంప్రదాయాలు కనుమరుగవుతున్న నేపథ్యంలో మళ్లీ పాతతరం, పాత ఆచారాలు, పాత సంప్రదాయాలు రావాలని ఆశిద్దాం.



## రైల్వే అధికారులకు అన్ని విధాలా సహకరిస్తాం

### - అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్

సూర్య కరీంనగర్ ప్రతినిధి

కొత్తపెల్లి-మనోహరాబాద్ రైల్వే లైన్ పనుల విషయంలో రైల్వే అధికారులకు అన్ని విధాలా సహకరిస్తామని అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో రైల్వే అథారిటీ అధికారులు, ఇరిగేషన్, మైనింగ్ శాఖ అధికారులతో రైల్వే లైన్ పనులపై అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఉప్పర మల్యాల, గర్షకుర్తి గ్రామాల్లో కొత్తపెల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్ కు సంబంధించిన భూ సేకరణ దాదాపు పూర్తయిందని తెలిపారు. దానికి సంబంధించిన రూ. 58 కోట్లు రైల్వే శాఖ డిపాజిట్ చేస్తే వెంటనే భూమి అందించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. కొత్తపెల్లి గ్రామంలో రైల్వే స్టేషన్ ఆధునికరించే పనులు అధికారులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. దానికి సంబంధించిన పనులకు మట్టి అందించే విషయంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని అదనపు కలెక్టర్ చెప్పారు. రైల్వే లైన్ పనులను వేగవ ంతంగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైల్వే శాఖ సీఈ ప్లానింగ్ అమిత్ అగర్వాల్, కరీంనగర్ ఆర్డీవో కే మహేశ్వర్, ఇరిగేషన్ ఎస్ఈ శివకుమార్, మైనింగ్ ఏడి రామాచారి, రైల్వే అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఎంపి బండి సంజయ్ వాహనం తనిఖీ

ముస్తాబాద్ వెళుతుండగా సిరిసిల్ల నియోజకవర్గంలోని వెంకట్రావుపల్లె వద్ద బండి సంజయ్ కుమార్ కాన్వాయ్ ను ఎన్నికల కోడ్‌లో భాగంగా తనిఖీ చేసిన పోలీసులు

సూర్య రాజన్న సిరిసిల్ల

## పిచ్చుకలను అందరూ సంరక్షించాలి

### - జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

సూర్య కరీంనగర్ ప్రతినిధి

కాలానుగుణంగా వాతావరణంలో వస్తున్న మార్పులతో పిచ్చుకలు రోజురోజుకు అంతరించిపోతున్నా యని, వాటిని అందరం కలిసి సంరక్షించుకుందామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. బుధవారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవం పురస్కరించుకొని కరీంనగర్ ఫిలిం భవన్ లో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ విద్యార్థులు తమ తమ ఇండ్లలోకి వచ్చే పిచ్చుకలను కాపాడాలని పేర్కొన్నారు. ఎండాకాలం నేపథ్యంలో వాటికి గూడు తయారు చేసి మంచినీళ్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. వాటిని సంరక్షించుకుంటేనే మానవ మనుగడ సాధ్యమవుతుందని తెలిపారు. పిచ్చుకలకు సేవ చేస్తే దేవుళ్లకు సేవ చేసినట్లేనని పేర్కొన్నారు. పక్షులతోనే మన చుట్టూ ఉన్న వాతావరణం బాగుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా రైటర్ కుశ్వంత్ సింగ్ ఘటనను ఉదాహరించారు. ఆయన పిచ్చుకల సంరక్షణకు తీసుకున్న చర్యలను పాఠశాలల్లో విద్యార్థులకు క్లాస్ లు ఏర్పాటుచేసి వివరించాలని కలెక్టర్ సూచించారు. పిచ్చుకలు, చిన్న చిన్న జంతువులను అందరం కలిసి కాపాడుకోవాలని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ ఇండ్లలో పిచ్చుకలను కాపాడు కునేందుకు గూడు ఏర్పాటు చేసి వాటర్ సదు పాయం కల్పించాలని సూచించారు. చిన్నపిల్లల లాగా వాటిని చూసుకోవాలని, తద్వారా అవి మనల్ని కాపాడతాయని పేర్కొన్నారు. డిఎఫ్ఓ బాలామణి, డీఈవో జనార్దన్ రావు మాట్లాడుతూ పిచ్చుకల సంరక్షణ పై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పర్యావ రణ సంరక్షణకు పిచ్చుకలు ఎంతో దోహద పడతాయని పేర్కొ న్నారు. వాతావరణ సమ తుల్యం కాపాడు తాయని చెప్పారు. ఈ సంద ర్భంగా జిల్లాలోని వివిధ



ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పిచ్చుకల గూడు ఏర్పాటు చేయ డం, ఆహారము, నీటి సౌకర్యం కల్పించే అంశ ంతో పాటు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వీటిని కలెక్టర్ ఆసక్తిగా తిలకిం చారు. చాలా బాగా తయారు చేశారని విద్యా ర్థులను అభినందించారు. ఇందులో ప్రతిభ చూపిన వారికి కలెక్టర్ బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి చాడ జైపాల్ రెడ్డి, సెక్టోరల్ అధికారి అశోక్ రెడ్డి, మండల విద్యాధికారి మధుసూదనాచారి, న్యాయ నిర్ణేతలు గాజుల రవీందర్, సరిత, కె ఎస్ అనంతచార్య, లక్ష్మణ్, అశోక్ రెడ్డి, జీవశాస్త్ర, ఫిజి కల్ సైన్స్ ఫోరం ప్రతినిధులు వీ ఆంజ నేయులు, గంగారాం ఎం శ్రీనివాస్ దామో దర్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంట్లో గొడవపడి ఆత్మహత్య చేసుకుంటానని పారిపోయిన వ్యక్తి

### - రెండు గంటల వ్యవధిలోనే ఆచూకీ కనిపెట్టిన కరీంనగర్ వన్ టౌన్ పోలీసులు

సూర్య కరీంనగర్ ప్రతినిధి

కరీంనగర్ పాత బజార్ చెందిన మందపల్లి దేవయ్య (55) అనే వ్యక్తి బుధవారం నాడు ఉదయం 10 గంటల సమయంలో భార్యతో గొడవపడి ఆత్మహత్యకు పాల్పడతానని ఇంట్లో నుండి వెళ్లిపోయాడని తన కూతురైన మందపల్లి రమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్రమత్తమైన కరీంనగర్ వన్ టౌన్ పోలీసులు వెంటనే ఎస్సై రవి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందంగా ఏర్పడి అందుబాటులో వున్న టెక్నాలజీ సహాయంతో కేవలం రెండు గంటల వ్యవధిలో 12 గంటలకే దేవయ్య పద్మనగర్ శివారులో ఉన్నట్లు కనిపెట్టి, వెంటనే అక్కడికి చేరుకొని అతన్ని అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ నిర్వహించి క్షేమంగా తన కూతురుకి అప్పగించినట్లు ఇన్స్పెక్టర్ సరిలాల్ తెలిపారు. దేవయ్యకు ఎటువంటి హాని జరగకుండా గుర్తించి కాపాడటంలో కృషి చేసిన ఎస్సై రవి , సిబ్బందిని సర్వర్‌లను ఇన్స్పెక్టర్ సరిలాల్ అభినందించారు.



## ఎల్.ఎం.డి పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన కరీంనగర్ పోలీస్ కమీషనర్

సూర్య తిమ్మాపూర్

కరీంనగర్ కమీషనరేట్ రూరల్ డివిజన్ లో గల ఎల్.ఎం.డి పోలీస్ స్టేషన్ ను కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి ఐపీఎస్ ఆకస్మిక తనిఖీ చేసారు.పోలీస్ స్టేషన్ లో గల పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకున్నారు . త్వరితగతిన వాటిని పూర్తి చేయాలనీ సూచించారు. రానున్న లోక్ సభ ఎన్నికల సందర్బంగా పోలీస్ స్టేషన్ సిబ్బందికి పలు సూచనలు చేసారు. పోలీస్ అధికారులంతా నిజాయితీగా , నిస్పక్షపాతంగా, పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో గల పోలింగ్ కేంద్రాలను ప్రతి ఒక్కరు విధిగా సందర్శించి ఏమైనా లోటు ఉన్నట్లయితే వెంటనే పై అధికారులకు తెలపాలన్నారు.రౌడీ షీటర్లు , హిస్టరీ షీటర్లతో పాటుగా గతంలో ఎన్నికల సమయం లో జరిగిన గొడవల ఆధారంగా బాధ్యులను గుర్తించి వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే బైండోవర్ కాబడి గడువు ముగిసిన వారిని తిరిగి బైండ్ ఓవర్ చేయాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత పోస్టులు పెట్టేవారిని సైతం గుర్తించి వారిని కూడా బైండ్ ఓవర్ చేయాలన్నారు. స్టేషన్ పరిధిలోగల సమస్యాత్మక , సున్నితమైన ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు అక్కడి పరిస్థితులపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలన్నారు. పెండింగ్ వారెంట్ల అమలు చేయాలన్నారు. విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవన్నారు. అధికారులంతా సమిష్టిగా పనిచేసి ఎన్నికలు ప్రశా ంతగా ముగిసేలా కృషి చేయాలన్నారు . ఈ కార్య క్రమంలో తిమ్మాపూర్ ఇన్స్పెక్టర్ స్వామి , ఎల్ ఎం డి ఎస్సై చేరాలు ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

